

విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206



పల్లె పండుగ 3.0 ప్రారంభం..
గ్రామాలకు రూ.11,085 కోట్లు

సంపుటి:-01, సంచిక:-125, బుధవారం 30-09-2026, పేజీలు:-4, వెల: 2/-, ఎడిటర్:- ఎల్లని రాజేశ్వర్ గౌడ్ , పబ్లిషర్స్ : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్

రేవంత్‌పై బండి సంజయ్ ఫైర్

దేవుళ్లను కూడా విభజిస్తారా?



- రాముడు, శివుడి మధ్య రేవంత్ రెడ్డి రాజకీయ చిచ్చు పెడుతున్నారన్న బండి సంజయ్
- కులం, ప్రాంతం తర్వాత దేవుళ్లను కూడా విభజిస్తున్న కాంగ్రెస్ అని విమర్శ
- దక్షిణ కాశీ, దక్షిణ అయోధ్య ఉన్న రాష్ట్రంలో ఇలాంటి రాజకీయాలు సరికాదంటూ హితవు
- ప్రధాని మోదీ కాశీ విశ్వనాథుని భక్తుడని, వేములవాడకు వచ్చారని గుర్తుచేశారు
- ఓట్ల కోసం దేవుళ్లను వాడుకుని, ఇప్పుడు విభజిస్తున్నారని తీవ్ర ఆరోపణ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తన ఓటు బ్యాంకు - మిగతా 2 లో

ఇప్పుడు గుజరాత్

వర్సెస్ దేశం: రేవంత్ రెడ్డి


- కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు
- ఇది నార్త్ వర్సెస్ సౌత్ కాదు, గుజరాత్ వర్సెస్ దేశం అని వ్యాఖ్య
- ఓటర్ల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ
- రాహుల్ గాంధీని కలిశాకే కాంగ్రెస్‌లో చేరానన్న రేవంత్



2లో

తెలంగాణ అభివృద్ధికి మోదీ సర్కార్ సహకరించడం లేదని విమర్శ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర

నేపాల్‌లో జలవిలయం



- ★6 సెకన్లలో కళ్లముందే కుప్పకూలి నదిలో కలిసిపోయిన భారీ కొండ
- ★ఈ ఘోర విపత్తుకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి
- ★వరదలు, కొండచరియల వల్ల 24 మంది మృతి, పలువురు గల్లంతు
- ★హిమపాతంలో చిక్కుకుని మరో ఇద్దరు మృతి, 10 మంది గల్లంతు


నేపాల్‌లో కురుస్తున్న భారీ వర్షాలు, - మిగతా 2 లో

తిరుమల వెంకన్నకు నిన్న భారీగా హుండీ ఆదాయం

- ఆదివారం నాడు శ్రీవారి హుండీకి రూ. 5.07 కోట్ల భారీ ఆదాయం
- నిన్న స్వామివారిని దర్శించుకున్న 83 వేల మందికి పైగా భక్తులు
- నేడు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు నిండి శిలాతోరణం వరకు క్యూలైన్లు
- సర్వదర్శనానికి 18 గంటల సమయం పడుతుందని అంచనా



2 లో..



2 లో..

యువకుడిపై చేయి చేసుకున్న మంత్రి

- తీవ్రంగా స్పందించిన రాహుల్ గాంధీ
- ఢిల్లీలో యువకుడిపై చేయి చేసుకున్న మంత్రి పర్వేశ్ వర్మ
- ఘటనపై తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ
- బీజేపీ నేతలకు ఓటర్లంటే భయం లేదంటూ విమర్శ
- ఇదంతా అధికార అహంకారమేనని రాహుల్ ఘాటు వ్యాఖ్యలు

తెలంగాణలో భగ్గుమంటున్న ఎండలు

2 లో..

- తెలంగాణపై ఎల్ నినో ప్రభావం
- సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రతలు
- నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో 35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- రానున్న రెండు రోజుల్లో మరింత పెరగనున్న ఎండలు

హెచ్-1బీ

వీసాలపై కొత్త నిబంధనలు

- భారీ ఫీజు వెనుక కారణం ఇదే: జేడీ వాన్స్
- హెచ్-1బీ వీసాలపై లక్ష డాలర్ల ఫీజును సమర్థించిన యూఎస్ వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్
- అమెరికన్ల స్థానంలో తక్కువ జీతాలకు విదేశీయులను నియమించుకోకూడదని స్పష్టీకరణ
- అత్యంత నైపుణ్యం కలిగిన వారితోనే అమెరికా ఆర్థిక వ్యవస్థ బలపడాలని వ్యాఖ్య
- ఉద్యోగులను తొలగించే కంపెనీలు హెచ్-1బీ వీసాలు పొందకుండా చర్యలు
- కాంగ్రెస్‌లో మద్దతు లేనందునే ఫీజు వంటి
- పరిపాలనాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడి



2 లో..

మైలురాళ్ల కోసం ఆడను



- వన్డేల్లో 15,000 పరుగులు పూర్తి చేసిన విరాట్ కోహ్లీ
- సచిన్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారత ఆటగాడిగా రికార్డ్
- అత్యంత వేగంగా ఈ మైలురాయిని అందుకున్న కోహ్లీ
- శారీరకంగా ఫిట్‌గా ఉండటమే తన నిలకడకు కారణమని వెల్లడి

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ - మిగతా 2 లో

చిత్తూరు జిల్లాలో మరోసారి ఏనుగుల సంచారం



2లో

- అధికారులను అప్రమత్తం చేసిన పవన్ కల్యాణ్
- చిత్తూరులో సంచరిస్తున్న ఏనుగులను అడవిలోకి మళ్లించాలని పవన్ కల్యాణ్ ఆదేశం
- ఆపరేషన్ కోసం ముసలమడుగు నుంచి కుంకీ ఏనుగులను తీసుకురావాలని సూచన
- పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని స్పష్టం
- మానవ-ఏనుగు ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం

నేపాల్‌లో జలవిలయం..

మొదటిపేజీ తరువాయి – వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ముస్తాంగ్ జిల్లాలో ఒక భారీ పర్వత భాగం కొద్ది సెకన్ల వ్యవధిలోనే కుప్పకూలి నదిలో కలిసిపోయిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ భయానక దృశ్యాలు ఆ దేశంలో నెలకొన్న విపత్కర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. ముస్తాంగ్ జిల్లాలోని లేటే సమీపంలో ఒక భారీ పర్వత భాగం కేవలం ఆరు సెకన్ల వ్యవధిలోనే కాళీ గండకి నదిలోకి జారిపడింది. చార్‌ధామ్ యాత్రికులు చిత్రీకరించిన ఈ వీడియోలో, కొండచరియలు వేగంగా కిందికి దూసుకురావడంతో స్థానికులు భయాందోళనలతో కేకలు వేయడం వినిపిస్తోంది. ఈ ఘటన కారణంగా నదీ ప్రవాహానికి తాత్కాలికంగా ఆటంకం ఏర్పడింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న మరో వీడియోలో, కొండచరియలు విరిగిపడటంతో చెట్లతో పాటు ఒక ఇల్లు కూడా లోయలోకి కొట్టుకుపోయింది. 'ఘర్ గయా సక్యో (ఇల్లు పోయింది) అంటూ గ్రామస్థులు భయాందోళనలతో హాహాకారాలు చేయడం, ఒక మహిళ రోదిస్తున్న దృశ్యాలు చూసేవారిని కలచివేస్తున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సంభవించిన వరదలు, కొండచరియల విరిగిపడిన ఘటనల్లో ఇప్పటివరకు 24 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది గల్లంతయ్యారు. ప్రతికూల వాతావరణం కారణంగా పలు జిల్లాల్లో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. మరోవైపు, మనాంగ్ జిల్లాలోని హిమ్లుంగ్ హిమాల్ బేస్ క్యాంప్ వద్ద సంభవించిన హిమపాతంలో ఇద్దరు మరణించగా, మరో 10 మంది ఆచూకీ లభ్యం కాలేదు. నెల రోజుల క్రితం సంభవించిన భోటేకోశీ వరదల విషాదం నుంచి కోలుకోకముందే నేపాల్‌ను మరో విపత్తు చుట్టుముట్టడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

తిరుమల వెంకన్నకు నిన్న భారీగా హుండీ ఆదాయం

మొదటిపేజీ తరువాయి – కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి వారి హుండీకి భక్తులు భారీగా కానుకలు సమర్పించారు. తిరుమలలో నిన్న (ఆదివారం) ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.07 కోట్లుగా నమోదైనట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. వారాంతపు సెలవు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఈ స్థాయిలో ఆదాయం సమకూరింది. టీటీడీ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, సెప్టెంబర్ 27వ తేదీన మొత్తం 83,578 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 31,137 మంది భక్తులు మొక్కులు చెల్లించుకుని తలనీలాలు సమర్పించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా రికార్డు స్థాయిలో 4.39 లక్షల లడ్డూలను విక్రయించినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా, దాదాపు 2.88 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో 3,631 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ పేర్కొంది. భక్తుల రద్దీ సోమవారం ఉదయం కూడా కొనసాగుతోంది. ప్రస్తుతం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు వెలుపల శిలాతోరణం వరకు విస్తరించాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, తిరుమలకు యాత్ర ప్రణాళిక చేసుకునేవారు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.

యువకుడిపై చేయి చేసుకున్న మంత్రి

మొదటిపేజీ తరువాయి – ఢిల్లీలో ఓ యువకుడిపై బీజేపీ మంత్రి భౌతిక దాడికి దిగిన ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. అధికార మదంతో బీజేపీ నేతలు ప్రవర్తిస్తున్నారని, వారికి ఓటర్లంటే కనీస భయం లేదని ఆయన ధ్వజమెత్తారు. వివరాల్లోకి వెళితే... ఢిల్లీ పీడబ్ల్యూడీ మంత్రి పర్వేశ్ వర్మ ఆదివారం తన నియోజకవర్గ పరిధిలోని తిలక్ నగర్‌లో రోడ్ల పనులను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఓ యువకుడు రహదారుల నిర్మాణంలోని లోపాలపై ప్రశ్నిస్తూ వీడియో తీయడం ప్రారంభించాడు. దీంతో ఆగ్రహానికి గురైన మంత్రి ఆ యువకుడి చెంపపై కొట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఉదంతంపై రాహుల్ గాంధీ మండిపడ్డారు. "ప్రజలు బహిరంగంగా ప్రశ్నిస్తే చెంపదెబ్బ, పేపర్ లీకేజీలపై నిలదీస్తే లాఠీఛార్జ్, పార్లమెంటులో గళమెత్తితే మైక్ ఆఫ్ చేయడం.. ఇవన్నీ అధికార అహంకారానికి నిదర్శనం" అని ఆయన పేర్కొన్నారు. ఓట్లు దొంగిలించి అధికారంలోకి వస్తున్నందునే, తప్పు చేస్తే ప్రజలు గద్దె దించుతారన్న భయం వారిలో లేకుండా పోయిందని రాహుల్ ఆరోపించారు. ఇలాంటి పార్టీలకు ప్రజల మద్దతుతో పనిలేదని ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ విమర్శలపై మంత్రి పర్వేశ్ వర్మ స్పందించారు. ఈ విషయం గురించి రాహుల్‌కు కనీస అవగాహన లేదని, ఆయన ఇటువంటి అంశాలకు దూరంగా ఉంటేనే మంచిదని హితవు పలికారు.

తెలంగాణలో భగ్గుమంటున్న ఎండలు

మొదటిపేజీ తరువాయి – తెలంగాణ రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. ఎల్ నినో ప్రభావం కారణంగా పగటి ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల మేర ఎక్కువగా రికార్డవుతున్నాయి. ఫలితంగా రాష్ట్ర ప్రజలు అకాల వేడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో గరిష్ఠంగా 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇది సాధారణం కంటే 4 డిగ్రీలు అధికం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 34 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు కాగా, హైదరాబాద్‌లో సాధారణ ఉష్ణోగ్రత 31.8 డిగ్రీలకు బదులుగా ప్రస్తుతం 34 డిగ్రీలుగా నమోదవుతోంది. ఎల్ నినో ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

హెచ్-1బీ వీసాలపై కొత్త నిబంధనలు



మొదటిపేజీ తరువాయి – హెచ్-1బీ వీసా వ్యవస్థపై అమెరికా ప్రభుత్వం తన కఠిన వైఖరిని కొనసాగిస్తోంది. కొన్ని హెచ్-1బీ వీసా దరఖాస్తులపై 100,000 డాలర్ల (సుమారు రూ.95లక్షలు) భారీ ఫీజు విధించాలన్న తమ యంత్రాంగం నిర్ణయాన్ని యూఎస్ వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ గట్టిగా సమర్థించుకున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా మేలు చేసే అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులను ఆకర్షించేందుకే హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ ఉండాలని, అంతేగానీ అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ జీతాలకు విదేశీయులను నియమించుకోవడానికి కాదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల 'ఆల్-ఇన్ పాడ్‌కాస్ట్'లో మాట్లాడిన జేడీ వాన్స్.. హెచ్-1బీ వీసాల వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని వివరించారు. "తక్కువ జీతాలకు పనిచేసే విదేశీయులతో అమెరికన్లను భర్తీ చేయడానికి హెచ్-1బీ వీసా విధానం లేదు. అమెరికా ఆర్థిక వ్యవస్థను సుసంపన్నం చేయడానికి మాత్రమే ఇది ఉపయోగపడాలి" అని ఆయన అన్నారు. టెక్నాలజీ రంగంలో లేదా ఇతర కీలక రంగాలలో గణనీయమైన మార్పు తీసుకురాగల నిపుణులను కంపెనీలు ఆహ్వానించాలని ఆయన సూచించారు. ఈ విషయాన్ని ఆయన ఒక ఉదాహరణతో మరింత స్పష్టంగా వివరించారు. "ఉదాహరణకు, ఒక అమెరికన్ అకౌంటెంట్ ఏడాదికి 60,000 డాలర్ల జీతం తీసుకుంటుంటే, ఆ వ్యక్తిని తొలగించి అదే స్థానంలో ఒక విదేశీ ఉద్యోగిని 45,000 డాలర్లకే నియమించుకోవడం హెచ్-1బీ వీసా అసలు లక్ష్యం కాదు" అని వాన్స్ తెలిపారు. ఇలాంటి పద్ధతులను అరికట్టడానికే కఠిన నిబంధనలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. హెచ్-1బీ వీసా వ్యవస్థలో విస్తృతమైన చట్టపరమైన మార్పులు తీసుకురావడానికి అమెరికా కాంగ్రెస్‌లో రాజకీయ సంకల్పం తక్కువగా ఉందని, అందుకే తమ ప్రభుత్వం ఫీజుల పెంపు వంటి పరిపాలనాపరమైన చర్యలపై దృష్టి సారించిందని జేడీ వాన్స్ అంగీకరించారు. అంతేగాక పెద్ద ఎత్తున అమెరికన్ ఉద్యోగులను తొలగించిన కంపెనీలు, కార్మికుల కొరత ఉందని చెబుతూ మళ్లీ హెచ్-1బీ వీసాల కోసం దరఖాస్తు చేయకుండా నిరోధించే మార్గాలను కూడా తమ యంత్రాంగం పరిశీలిస్తోందని ఆయన వెల్లడించారు. హెచ్-1బీ వీసా వ్యవస్థను కఠినతరం చేసేందుకు జరుగుతున్న సంస్కరణల చర్చల నేపథ్యంలో వాన్స్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి: ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి – ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, విప్రో సర్కిల్ వద్ద మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మౌనాన్ని తన భాషగా మార్చుకుని, దేశానికి అద్భుతమైన పాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. అంతటి మహనీయుడికి భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవ తీసుకుని మన్మోహన్ సింగ్‌ను భారతరత్నతో సత్కరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల దార్శనికత వల్లే దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయని, దాని ఫలితంగానే నేడు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివి రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ చట్టాన్ని తీసుకువచ్చి, భూనిర్వాసితుల అంగీకారాన్ని తప్పనిసరి చేసిన ఘనత మన్మోహన్ సింగ్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. మన్మోహన్ సింగ్ జీవితం నేటి 'జెన్-జెడ్' సహా అన్ని తరాలకు స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లాలో మరోసారి ఏనుగుల సంచారం



మొదటిపేజీ తరువాయి – చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను, రైతులను భయాందోళనలకు గురిచేస్తున్న ఏనుగుల గుంపును వెంటనే అడవిలోకి సురక్షితంగా మళ్లించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముసలమడుగు శిబిరం నుంచి కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు. సోమవారం పడిపుట్లబైలు సమీపంలో ఏనుగుల సంచారంపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత 15 రోజులుగా 11 ఏనుగులతో కూడిన గుంపు, దాని నుంచి విడిపోయిన మరో రెండు ఏనుగులు పడిపుట్లబైలు పంచాయతీ పరిధిలోని పుండ్లవల్లపల్లి, నడింపల్లి, కొండకిందపల్లి గ్రామాల్లో సంచరిస్తున్నాయని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఏనుగులు వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఒక ఏనుగుల గుంపు రహదారి దాటి మంగళంపేట బీట్‌లోకి ప్రవేశించగా, మరో రెండు ఏనుగులు చిత్తూరు వైపు కదులుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ ఏనుగుల సంచారం వల్ల పాకాల, పులిచెర్ల, చంద్రగిరి మండలాల ప్రజలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మానవ-ఏనుగు ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. "ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. అటవీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖలు, హనుమాన్ బృందాలు సమన్వయంతో పనిచేయాలి. క్షేత్రస్థాయి బృందాలు నిరంతరం నిఘా ఉంచి, ప్రమాదం పొంచి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలి" అని ఆయన స్పష్టం చేశారు. ఏనుగుల వల్ల పంట నష్టపోయిన రైతులకు తక్షణం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూసుకుంటూనే, ఏనుగులను సురక్షితంగా తిరిగి అటవీ ప్రాంతంలోకి మళ్లించే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల భద్రత, పంటల పరిరక్షణకు అన్ని

రేవంత్‌పై బండి సంజయ్ ఫైర్.. దేవుళ్లను కూడా విభజిస్తారా?



మొదటిపేజీ తరువాయి – రాజకీయాల కోసం దేవుళ్లను కూడా విభజించే నీచమైన ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. రాముడు, శివుడి మధ్య రాజకీయ విభజన రేఖలు గీస్తూ, ఉత్తర, దక్షిణ భారత దేవుళ్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. "కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు దేవుళ్ల మధ్య కూడా విభేదాలు సృష్టిస్తూ కొత్త హేలాహలాన్ని తయారు చేస్తోంది" అని బండి సంజయ్ విమర్శించారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ, దక్షిణ అయోధ్యగా పిలవబడే భద్రాచలం ఉన్న తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డికి ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. "మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్‌నగర్‌లోనే హరిహర క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన మన్యంకొండ ఉంది. శివుడు, విష్ణువుల ఐక్యతకు ప్రతీక అయిన ఆ క్షేత్రం గురించి మీకు తెలియదా?" అని నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ కాశీ విశ్వనాథుడైన శివుడికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న మొట్టమొదటి ప్రధాని కూడా ఆయనేనని బండి సంజయ్ గుర్తుచేశారు. "ఎన్నికల సమయంలో దేవుళ్లపై ప్రమాణాలు చేసి ఓట్లు అడిగిన మీరు, ఇప్పుడు అదే ప్రజలను విభజించడానికి దేవుళ్లకు కులం, ప్రాంతం అంటగడుతున్నారు. శివుడి హృదయంలో విష్ణువు, విష్ణువు హృదయంలో శివుడు ఉంటారనేదే సనాతన ధర్మం" అని పేర్కొన్నారు. కాంగ్రెస్ విభజన రాజకీయాలను హిందువులు గమనించాలని, బీజేపీ నేతలు 'హర్ హర్ మహాదేవ్' అనరని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, ప్రధాని మోదీ స్వయంగా ఆ నినాదం చేస్తారని స్పష్టం చేశారు.

ఇప్పుడు గుజరాత్ వర్సెస్ దేశం: రేవంత్ రెడ్డి



మొదటిపేజీ తరువాయి – ప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సంచలన ఆరోపణలు చేశారు. ప్రస్తుతం దేశంలో ఉత్తర, దక్షిణ భారత్ మధ్య కాకుండా, 'గుజరాత్ వర్సెస్ దేశం' అన్నట్లుగా పరిస్థితులు నెలకొన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. అసోంకు చెందిన 'ప్రతిదిన్' దినపత్రిక "భారత్ తదుపరి అధ్యాయం" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) టెండర్లకు కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అనుమతులు నిలిపివేసిందని మండిపడ్డారు. దేశం నిధులను గుజరాత్‌కు మాత్రమే తరలిస్తున్నారని, అందుకే ఇది గుజరాత్ వర్సెస్ దేశం అనే పోరాటంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో కేంద్ర ప్రభుత్వం పెద్ద కుట్రకు పాల్పడుతోందని రేవంత్ ఆరోపించారు. ఈ ప్రక్రియ ద్వారా పేదలు, ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లను తొలగిస్తున్నారని, ఇప్పటికే దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని, భవిష్యత్తులో మరిన్ని ఓట్లు తొలగించే ప్రణాళికతో ఉన్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్ గో బ్యాక్' ఉద్యమం రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్‌ను కేంద్రం తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని దుయ్యబట్టారు.

రెండుసార్లు కాంగ్రెస్ అభ్యర్థులపై గెలిచా

తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న రేవంత్ రెడ్డి, ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులపై రెండుసార్లు గెలిచానని, అయితే నాటి ప్రభుత్వంతో పోరాడేందుకు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీలో చేరానని తెలిపారు. 2014 తర్వాత తెలంగాణలో పోరాటం ప్రధానంగా కేసీఆర్‌కు, తనకు మధ్యనే జరిగిందని, తాను అసెంబ్లీలో కంటే జైలులోనే ఎక్కువ సమయం గడపాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. 2017లో రాహుల్ గాంధీని కలిసిన తర్వాత కాంగ్రెస్‌లో చేరానని, ఆయనే తన నాయకుడని నిర్ణయించుకున్నానని చెప్పారు. రాహుల్ గాంధీకి వ్యక్తిగత ఎజెండా లేదని, ఆయన దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తారని కొనియాడారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్‌దే ఏకపక్ష ఆధిపత్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

మైలురాళ్ల కోసం ఆడను



మొదటిపేజీ తరువాయి – వన్డే క్రికెట్‌లో మరో అరుదైన మైలురాయిని అందుకున్నాడు. వెస్టిండీస్‌తో తిరువనంతపురంలో ఆదివారం జరిగిన తొలి వన్డేలో అద్భుత శతకం (139 నాటౌట్) సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలోనే వన్డేల్లో 15,000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. దిగ్గజ ఆటగాడు సచిన్ టెండూల్కర్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారత ఆటగాడిగా, ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఈ మైలురాయిని చేరుకున్న తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. మ్యాచ్ అనంతరం తన రికార్డుపై స్పందించిన కోహ్లీ, మైలురాళ్ల కంటే జట్టు విజయాలే తనకు ముఖ్యమని స్పష్టం చేశాడు. "నా దృష్టి ఇలాంటి మైలురాళ్లపై ఉండదు. జట్టు అవసరాలకు తగ్గట్టు ఆడటంపైనే దృష్టి పెడతాను. ఈ క్రమంలో రికార్డులు వాటంతట అవే వస్తాయి. ఇన్నేళ్లుగా దేశం తరఫున ఆడే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని తెలిపాడు. ప్రస్తుతం తన కెరీర్‌లో ఈ దశలో ఆటలో సరికొత్త వెర్షన్‌ను ఆవిష్కరించుకోవాలని సవాలుగా తీసుకున్నానని కోహ్లీ చెప్పాడు. "శారీరకంగా ఫిట్‌గా ఉండటం వల్ల మానసికంగా స్వేచ్ఛగా ఆడగలుగుతున్నాను. నా నిలకడకు ఇదే కారణం. ఒక ఫార్మాట్‌కే పరిమితం కావడం వల్ల 2027 ప్రపంచకప్‌పై నా లక్ష్యాలకు మరింత స్పష్టత వచ్చింది" అని వివరించాడు. యువ ఆటగాళ్లు బయటి విషయాలను పట్టించుకోకుండా, ప్రతి మ్యాచ్‌ను చివరి మ్యాచ్‌లా భావించి ఆడాలని సూచించాడు. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (110)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పడంపై కోహ్లీ హర్షం వ్యక్తం చేశాడు. గిల్‌కు ఆటపై సరైన దృక్పథం ఉందని, అందుకే అతను జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడని ప్రశంసించాడు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా బీఆర్ఎస్ పనిచేస్తుంది

ఎమ్మెల్యే కేపీ.వివేకానంద



నిజాంపేట,సెప్టెంబర్29(విజన్ పక్షం దినపత్రిక): నిజాంపేట్ సర్కిల్ పరిధి విజయదుర్గా కాలనీలో దాదాపు రూ.తొంభై(90)లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన మౌనిక వసతులను కల్పించాలనే లక్ష్యంతో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాలలో గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామన్నారు.రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. శివారు ప్రాంతాలలో వెలుస్తున్ననూతన కాలనీలలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజయ దుర్గ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. రమణారెడ్డి,వైస్ ప్రెసిడెంట్ శ్యాంసింగ్,ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి,సభ్యులు ఎస్. రాకేష్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, సుమన్, వైయస్, బి. సందీప్, విశ్వనాథ రెడ్డి, వినోద్, శివ నాగరాజు, యుగంధర్, దుర్గాప్రసాద్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు బాలాజీ నాయక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు అభిషేక్ రెడ్డి, సలీం, చంద్రగిరి సతీష్, నాయకులు సాంబశివరెడ్డి, శ్రీకర్ గుప్తా, మధుసూదన్ రెడ్డి, స్వామి, దశరథ, ముత్యాలు, చంద్రయ్య, స్టాలిన్ రెడ్డి, మహిళా నాయకురాలు లతా రెడ్డి, కృష్ణ మంజరి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లపై కూన శ్రీశైలం గౌడ్ సమీక్షా సమావేశం



కుత్బుల్లాపూర్,సెప్టెంబర్29(విజన్ పక్షం దినపత్రిక): రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలో రేపు జరగబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే,కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్ తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి జన సమీకరణ, సభా ఏర్పాట్లు,ఇతర కార్యక్రమాల నిర్వహణపై నాయకులతో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. సమావేశంలో తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మునిగే రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్ టోనీ, ముఖ్య నాయకులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేను ఓటు నమోదు చేసుకున్నాను... మరి మీరు?

ఎమ్మెల్యే కెపి.వివేకానంద



కుత్బుల్లాపూర్,సెప్టెంబర్29(విజన్ పక్షం దినపత్రిక): రాబోయే గ్రాడ్యుయేట్(పట్టభద్రుల) ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హత కలిగిన పట్టభద్రులు తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్ ఎల్పీవిప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నమోదు పత్రం ఫారం--18ను స్వయంగా నింపి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... హైదరాబాద్,రంగారెడ్డి,మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి సంబంధించిన రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ 06-11-2026లోపు తప్పనిసరిగా ఫారం-18 ద్వారా తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా ప్రతి ఎన్నికకు ముందు కొత్తగా రూపొందించబడుతుందని గతంలో గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదై ఉన్నవారు సైతం ప్రస్తుత ఎన్నిక కోసం మరలా తాజాగా ఫారం-18 నింపి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే సాధారణ అసెంబ్లీ ఓటరు జాబితాలో పేరు ఉండటం మాత్రమే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందడానికి సరిపోదని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు కోసం ప్రత్యేకంగా ఫారం-18 ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లు తమ అసెంబ్లీ ఎపిక్ ఓటరు కార్డ్ వివరాలను ఫారం-18లో పొందుపరిస్తే సరిపోతుందన్నారు. "నేను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు చేసుకున్నాను...మరి మీరు కూడా మీ ఓటును నమోదు చేసుకున్నారా?" అని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పట్టభద్రులు పిలుపునిచ్చారు.

హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలపై బీజేపీ భగ్గుమంది

మొయినాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

"ఖబర్దార్.. దేవుళ్లను, ప్రజలను విభజించే రాజకీయాలు మానుకోవాలి" --- బీజేపీ నేతలు






సెప్టెంబర్ 29 । విజన్ పక్షం । మొయినాబాద్: హిందూ దేవుళ్లు, హిందూ విశ్వాసాలు, బీజేపీ నాయకులపై సీఎం రేవంత్ రెడ్డి చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలను నిరసిస్తూ మొయినాబాద్ మండల బీజేపీ ఆధ్వర్యంలో తీవ్ర నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. శ్రీరాముడు, పరమశివుడు హిందూ విశ్వాసానికి ప్రతీకలని, వారిని విభజిస్తూ ఉత్తర--దక్షిణ రాజకీయాలకు తెరతీయడం ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నమని విమర్శించారు. దేవుళ్లు, హిందువులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని రాజకీయాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు మతపరమైన అంశాలను రాజకీయాల్లోకి తీసుకురావడం సరికాదని నాయకులు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కే.ఎస్. రత్నం, రాష్ట్ర సీనియర్ నాయకుడు కంజర్ల ప్రకాష్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మమతా రెడ్డి, కిసాన్ మోర్చా వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మోర నరసింహ రెడ్డి, అత్తాపురం శ్రీనివాస్ గౌడ్, ఏబీవీపీ నాయకుడు శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్ షాబాద్ కిషన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రవి యాదవ్, ప్రభాకర్ యాదవ్, అశోక్ యాదవ్, వెంకటేష్ గౌడ్, సుధీర్ యాదవ్, వెంకటేష్, దీప మరుపల్లి, సబిత, సుహాసిని, మండల ప్రధాన కార్యదర్శి రాయనోళ్ల రవీందర్ యాదవ్తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. "భారత్ మాతా కీ జై.. జై శ్రీరామ్.. ఓం నమఃశివాయ" అంటూ బీజేపీ శ్రేణులు నినదించారు.

స్నేహానికి ప్రతీక వీరే

అకాల మరణం చెందిన శివ కుటుంబానికి 36,000 ఆర్థిక సహాయం

'మేమున్నాం' అంటూ బాసటగా నిలిచిన ఇంటర్మీడియట్ సహచరులు



షాబాద్, సెప్టెంబర్ 29(విజన్ పక్షం): షాబాద్ మండలంలోని లక్ష్మారావు గూడ గ్రామానికి చెందిన మిత్రుడు శివ ఇటీవల అకాల మరణం చెందారు. వారి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన తన ఇంటర్మీడియట్ మిత్రులు వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 36000/- అందజేసి బాసటగా నిలిచారు.ఇంతటి సహాయాన్ని ఆ కుటుంబానికి అందించి, మానవతా దృక్పథాన్ని చాటి చెప్పారు. శివ ఆకస్మిక మరణం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి తోడుగా నిలవడం తమ బాధ్యతగా భావించి మిత్రులంతా ఒక్కటయ్యారు. దుఃఖంలో ఉన్న స్నేహితుడి కుటుంబానికి 'మేమున్నాం' అనే భరోసా కల్పిస్తూ, ఆ కుటుంబానికి ధైర్యాన్నిచారు. ఈ కార్యక్రమంలో మిత్రులు బ్యాగరి సుదర్శన్,మహేష్ చారి,ప్రసాద్ గౌడ్, నామా సురేష్,ఉపసర్పంచ్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ ఆర్టీవోలో ఏజెంట్ల హవా...?

ఆన్‌లైన్ సేవలు అందుబాటు లో ఉన్నా...సామాన్యుడికి ఎందుకీ ఇబ్బందులు. ఏజెంట్ ద్వారా వెళ్తే గంటల్లో పని...నేరుగా వెళ్తే రోజుల తరబడి తిప్పలంటున్న వాహనదారులు. కార్యాలయంలో ఏజెంట్ల రాకపోకలపై అనేక అనుమానాలు... లిఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీలకు డిమాండ్.

నందిగామ: సెప్టెంబర్ 29(విజన్ పక్షం): ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో రవాణా శాఖ అనేక సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చింది. అయితే నందిగామ ఆర్టీవో కార్యాలయంలో క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ కార్యాలయంలో పనులు పూర్తి చేసుకోవడానికి ఏజెంట్ల ను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ లో దరఖాస్తు.. ఆఫీసులో అడుగడుగునా ఇబ్బందులా? లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ తదితర సేవల కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని వల్ల కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం తగ్గుతుందని ప్రజలు ఆశించారు. కానీ నేరుగా కార్యాలయానికి వెళ్లే సామాన్య వాహనదారు లకు ఫైల్ కదలడం లేదని, సర్వర్ సమస్య ఉందని, సంబంధిత అధికారి అందుబాటులో లేరని చెప్పి పలుమార్లు తిప్పుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. "అదే పని ఏజెంట్ ద్వారా వెళ్తే మాత్రం త్వరగా పూర్తవుతోంది" అని కొందరు వాహనదారులు చెబుతున్నారు. ఏజెంట్లకు అంత స్వేచ్ఛ ఎలా? ఆర్టీవో కార్యాలయంలో ఏజెంట్ల రాకపోకలపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కార్యాలయ పరిసరాల్లో ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న వ్యక్తుల సంచారం, అధికారు లతో వారి సన్నిహిత సంబంధాలపైవాహనదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. న్యూస్‌కు లభించిన దృశ్యాల్లో కొందరు వ్యక్తులు కార్యాలయంలోకి రాకపోకలు సాగిస్తున్నట్లు కనిపించడం చర్చనీయాంశం గా మారింది. అయితే ఈ వ్యక్తులు అధికారికంగా అనుమతించబడిన వారేనా? లేక అనధికారికంగా కార్యాలయంలోకి ప్రవేశిస్తున్నారా? అనే విషయంపై రవాణా శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

"ఏజెంట్ లేకుండా పని కాదా?"ప్రజల నుంచి ప్రధానం గా వినిపిస్తున్న ప్రశ్న ఇదే.

ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు మధ్యవర్తుల అవసరం తగ్గుతుందని ప్రజలు భావించారు. కానీ ఏజెంట్ ద్వారా వెళ్లినప్పుడు పనులు వేగంగా పూర్తవుతున్నాయనే ఆరోపణలు వస్తే, ఆ వ్యవస్థ లో ఎక్కడ లోపం ఉందో అధికారులు గుర్తించాల్సిన అవసరం ఉంది. అదనపు డబ్బులు చెల్లిస్తేనే పని వేగంగా జరుగుతోందన్న ఆరోపణలు నిజమైతే, అది ప్రభుత్వ పారదర్శక సేవల లక్ష్యానికే విరుద్ధంగా మారుతుందని ప్రజలు అంటున్నారు. సామాన్యుడి సమయం.. డబ్బు.. ఎవరు కాపాడాలి? ఒక సాధారణ వాహనదారుడు తన పని కోసం ఒకరోజు కార్యాలయా నికి వెళ్లి, పని కాకపోవడంతో మళ్లీ మళ్లీ రావాల్సి వస్తే అతనికి సమయం, ప్రయాణ ఖర్చు రెండూ భారమే. అదే సమయంలో అదనపు మొత్తాలు చెల్లించి మధ్యవర్తుల ద్వారా పనులు సులభంగాపూర్తవుతున్నాయనే పరిస్థితి ఉంటే, ప్రభుత్వ సేవలు సామాన్యుడికి ఎందుకు అందుబాటులోకి రావడం లేదనే ప్రశ్న తలెత్తుతుంది.ప్రజలు చెల్లించే ప్రభుత్వ రుసుము ఎంత? అదనంగా ఎవరైనా డబ్బులు అడిగితే అది చట్టబద్ధమా? సేవ ఆలస్యమైతే ఎవరిని సంప్రదించాలి? ఫిర్యాదు ఎక్కడ చేయాలి? అనే విషయాలపై రవాణా శాఖ అధికారులు ప్రజలకు స్పష్టమైన సమాచారాన్ని అందించాల్సిన అవసరం ఉంది.

అధికారులు స్పందించాల్సిన సమయం ఇదే!

నందిగామ ఆర్టీవో కార్యాలయంలో ఏజెంట్ల రాకపోకలు, ప్రజలకు సేవలు అందుతున్న తీరు, పనుల ఆలస్యం, అదనపు వసూళ్లపై వస్తున్న ఆరోపణలను రవాణా శాఖ ఉన్నతాధి కారులు సమగ్రంగా పరిశీలించాలని వాహనదారులు కోరుతున్నారు.జిల్లా కలెక్టర్, రవాణా శాఖ ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అవి నిరాధారమైతే వాస్తవాలను ప్రజలకు స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు. ప్రజలకు విజ్ఞప్తి ప్రభుత్వ సేవ కోసం ఎవరైనా అనధికారి కంగా అదనపు డబ్బు



డిమాండ్ చేస్తే, సాధ్యమైనంతవరకు రసీదు లేకుండా చెల్లింపులు చేయకండి. సంబంధిత అధికారులను సంప్రదించండి. మీకు ఎదురైన సమస్యకు సంబంధించిన దరఖాస్తు వివరాలు, రుసుము రసీదులు, ఇతర ఆధారాలను భద్రపరచుకోండి.అవసరమైతే సంబంధిత ఉన్నతాధికారు ర్లకు అధికారికంగా ఫిర్యాదు చేయండి. ప్రభుత్వ కార్యాలయం ప్రజల కోసం..

ప్రజల పని కోసం ప్రజలు ఏజెంట్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి రాకూడదు.

ఇది కేవలం నందిగామ వాహనదారుల సమస్య కాదు.. ప్రభుత్వ సేవలు నిజంగా సామాన్యుడి గడపకు చేరుతున్నాయా? అనే ప్రశ్న. అధికారులు వచ్చిన వాళ్ళు చేసేది ఏమి లేదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న అక్కడి అధికారుల తీరు.

యోగాతో ఆరోగ్యం.. ప్రతిభకు రెక్కలు!

కొనకంచి అశ్విని అరుదైన ఘనత.. జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రథమ స్థానం విద్యార్థుల విజయాలకు యోగా, క్రీడలు పునాది.. యువతలో ఆరోగ్యంపై అవగాహన పెరగాలి : ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట: సెప్టెంబర్ 29(విజన్ పక్షం): గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని యోగాలో అసాధారణ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించడం అభినందనీయమని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. అశ్విని సాధించిన విజయం గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. పెనుగంచిప్రోలు మండలం కొనకంచి గ్రామానికి చెందిన కన్నేటి అశ్విని ఇటీవల విజయవాడలో నిర్వహించిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో భాగంగా జరిగిన యోగా పోటీల్లో పాల్గొన్నారు. ఆసనాలు, ఎప్పె రైటింగ్ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించారు. విజయం సాధించిన అనంతరం అశ్విని మంగళవారం జగ్గయ్యపేటలోని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెను అభినందించి, భవిష్యత్తులో యోగాలో మరిన్ని విజయాలు సాధించి నియోజకవర్గానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

చిన్న వయసులోనే యోగాపై ఆసక్తి పెంచాలి

ప్రస్తుత కాలంలో విద్యార్థులపై చదువుతో పాటు వివిధ రకాల ఒత్తిళ్లు ఉంటున్న నేపథ్యంలో యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు కూడా ఉపయోగపడే సాధనగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయం యోగా, వ్యాయామం, క్రీడలకు కేటాయించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. "చదువుతో పాటు ఆరోగ్యం.. ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసం.. ఈ రెండింటినీ పెంపొందించడంలో యోగా, క్రీడలు కీలకం" అనే సందేశాన్ని ప్రతి విద్యార్థికి చేరవేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఒకరి విజయం.. ఎందరికో స్ఫూర్తి

అశ్విని సాధించిన విజయం ఒక్క ఆమెకే పరిమితం కాకుండా గ్రామంలోని, మండలంలోని ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రతిభకు గ్రామీణ ప్రాంతం అడ్డంకి కాదని, సరైన ప్రోత్సాహం, నిరంతర సాధన ఉంటే ఏ వేదికపైనైనా ప్రతిభను చాటవచ్చని ఈ విజయం నిరూపిస్తోందన్నారు. తల్లిదండ్రులు పిల్లల్లో కేవలం చదువుపైనే కాకుండా యోగా, క్రీడలు, కళలు, ఇతర సృజనాత్మక రంగాలపై ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యవంతమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన యువతను తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ ఖాసిం, మారేపల్లి శౌరి, షేక్ ఉమ్మర్ తదితరులు పాల్గొన్నారు.

మన చెత్త.. మన బాధ్యత!

చెత్తను ఇంటివద్దే వేరు చేస్తే.. పరిశుభ్రమైన జగ్గయ్యపేట మన చేతుల్లోనే 10 ఈ-ఆటోలతో ఇంటింటి చెత్త సేకరణకు శ్రీకారం.. ప్రజల భాగస్వామ్యమే పారిశుద్ధ్య విజయానికి కీలకం

జగ్గయ్యపేట: సెప్టెంబర్ 29(విజన్ పక్షం): పరిశుభ్రమైన పట్టణం అంటే కేవలం రోడ్లు ఊడ్చడం కాదు.. చెత్త పుట్టిన చోటే దానిని సక్రమంగా వేరు చేసి నిర్వహించడం. ఈ బాధ్యత లో ప్రజలు భాగస్వాములైతేనే జగ్గయ్యపేటను సంపూర్ణ పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దడంసాధ్యమవుతుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత పటిష్టం చేసేందుకు స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ అందజేసిన 10 ఎలక్ట్రికల్ ఈ-ఆటోలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఇక ఇంటి ముంగిటకే చెత్త సేకరణ

ఈ-ఆటోల ద్వారా పట్టణం లోని ఇళ్ల వద్దకు వెళ్లి చెత్తను సేకరించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అయితే వాహనాలు అందుబాటులోకి రావడం ఒక్కటే పారిశుద్ధ్యానికి పరిష్కారం కాదని.. ప్రజలు తమ ఇళ్లలోనే చెత్తను వేరు చేసి అందించినప్పుడే ఈ వ్యవస్థ పూర్తిస్థాయిలో విజయవంతమవుతుందని స్పష్టం చేశారు. ఈ-ఆటోల్లో తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ప్రమాదకర వ్యర్థాల కోసం ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశారు. దీంతో చెత్తను మూలం వద్దే వేరు చేసి సేకరించేందుకు అవకాశం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

చెత్త కలిపితే సమస్య.. వేరు చేస్తే పరిష్కారం

ప్రజలు తడి, పొడి చెత్తను కలిపి ఇవ్వకుండా ఇంటివద్దే వేరు చేయాలని అధికారులు సూచించారు. ఎలక్ట్రానిక్, ప్రమాదకర వ్యర్థాలను సాధారణ చెత్తలో కలపకుండా ప్రత్యేకంగా అందించాలని కోరారు.ఒక కుటుంబం రోజూ పాటించే చిన్న అలవాటు.. మొత్తం పట్టణ ఆరోగ్యంపై పెద్ద ప్రభావం చూపగలదు. చెత్తను రోడ్లపై, కాలువల్లో, ఖాళీ ప్రదేశాల్లో వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందించడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచవచ్చని తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ పట్టణం

మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ ఈ-ఆటోలతో ఇంటింటి చెత్త సేకరణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని తెలిపారు. ప్రజలు మున్సిపాలిటీకి సహకరించి తమ ఇళ్ల వద్దే చెత్తను వేరు చేసి సిబ్బందికి అందించాలని కోరారు.మున్సిపల్ కమిషనర్ పి.వి.వి.డి. ప్రసాద్ మాట్లాడుతూ అవసరమైన వార్డులకు ఈ-ఆటోలను కేటాయించి డోర్‌టు డోర్ చెత్త సేకరణను బలోపేతం చేస్తామని తెలిపారు. వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడం ద్వారా శాస్త్రీయ పద్ధతిలో నిర్వహణకు మరింత అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

"పరిశుభ్రతపై అవగాహన.. ఆరోగ్యంపై రక్షణ"

పట్టణ పరిశుభ్రత అనేది కేవలం అందం కోసం మాత్రమే కాదని.. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాల సంక్షేమంతో ముడిపడి ఉన్న అంశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తే, ప్రజలు బాధ్యతాయుతంగా వాటిని వినియోగించడం ద్వారా మాత్రమే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. జగ్గయ్యపేటను పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు ప్రజల సహకారం కూడా అవసరమని ఎమ్మెల్యే అన్నారు. ఇంట్లో చెత్తను వేరు చేద్దాం.. మున్సిపల్ సిబ్బందికి అందిద్దాం.. రోడ్లు, కాలువలను కాపాడుకుందాం.. జగ్గయ్యపేటను పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దుదాం అనే సందేశంతో ప్రజలు ముందుకు రావాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ అక్బర్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, శానిటరీ సెక్రటరీలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల



నీలాంబ ఉరివేసుకుని చనిపోయిన మరునాడే.. కళామందిరానికి వచ్చింది లలితాంబ. వెళ్లి దూరంగా కొందరు మహిళా కవయిత్రుల మధ్య కూర్చుంది. ఎక్కడో ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.. విడిపోయాయి. ఇద్దరి మధ్య పూర్తి నిశ్శబ్దం! అదొక నృత్త విన్యాసం.. దాని అర్థం ఆ పరమేష్టికే తెలియాలి!! జీవితం.. కనీసపు శారీరకతృష్ణ కూడా తీరని ఓ ఎండిన మోడుగానే బతుకు ముగిసిపోతుందా!? నీలాంబక్కను తల్పంపై అలా చూసేసరికి ఆరోజు లలితాంబ చేతిని తన గుండెకు తాకించడం తప్పయిందా?.. అప్పటికే తమమధ్య ఆమె కోరుకున్న భోగినీ పండుగ జరిగినట్లు భావించి ఆ సంతోషంలో.. శారీరక బాధల నుంచి విముక్తి కోరుకుని ఉరి వేసుకుందా!? అది కూడా ఖర్మకొద్దీ ఆ రోజునే.. ప్చ్! నీలాంబ మరణం కలిగించిన లోలోన ఘర్షణను మర్చిపోవడానికి అన్నట్లు ఈ పెళ్లిపనులు మీదికెత్తుకున్నాడు జాయచోడుడు. రాత్రింబవళ్లు మరో ఆలోచన రాకుండా అన్నీ తానై నిర్వహిస్తున్నాడు.కాకతీయ సామంత రాజ్యాలన్నీ కూడా గణపాంబ వివాహం తెచ్చిన ఉత్సవ వాతావరణంతో సంబరాలను జరుపుకొంటున్నాయి. సంబరాలతో పులకించిపోతోంది అనుమకొండ మహానగరం. నగరమంతా చలువ తాటాకులతో పెళ్లిపందిరులు వేస్తున్నారు. ఇక కాకతీయకోట, అందులో ఉన్న నియోగాలు, భవనాలు, రాజప్రాసాదాలు, రాజనగరి అన్నిటా సంతోష సందడులే. రాజనగరి మరీమరీ వెలిగిపోతోంది. రాజ్యమంతటా ఆనందసంద్రాలు పొంగి పొరలుతున్నాయి. పెళ్లి బరువు బాధ్యతల నడుమ కాబోయే కాకతీయ వారసులపై ఓ కన్నేసి ఉంచాడు జాయచోడుడు. ముఖ్యంగా పెద్ద మేనల్లుడు రుద్రమదేవుడు, రెండవ మేనల్లుడు మురారిదేవుడు.. వాళ్లిద్దరి కదలికలు, ఉత్సాహ ఉద్వేగాలు.. పెళ్లి సంబరాల్లో వాళ్ల ఆటపాటలు.. అన్నీ పరిశీలిస్తున్నాడు. హరిహరుడు, మురారి విసురునాడులోని గురుకులంలో యుద్ధవిద్యలు అభ్యసిస్తుండగా.. హరిహరుడు కాలధర్మం చెందాడు. మురారి అక్కడే చదువు కొనసాగిస్తున్నాడు. గణపాంబ పూర్తిగా రాజప్రాసాదంలోనే రాజగురువుల వద్ద చదువుకుంటుండగా.. రుద్రమదేవుడు త్రిపురాంతకం గోళకిమఠంలోని విద్యాకేంద్రంలో చదువుతున్నాడు. చదువుతోపాటు యుద్ధవిద్యల్లో కూడా నిష్ణాతుడని విన్నాడు. జాయచోడుని నాజూకు శరీరం రాలేదు గానీ.. అందంలో మేనమామకు తీసిపోడు మురారి. చుట్టూ పదిమంది మిత్రులను వెంటేసుకుని ఎప్పుడూ ఘల్లుఘల్లున నవ్వుతూ కేరింతలలో కనిపిస్తున్నాడు మురారి. రుద్రమదేవుడి పక్కన కూడా ఉన్నారు మిత్రులు.. కాదుకాదు అంతా మిత్రురాళ్లు! ఆశ్చర్యపోయాడు. రుద్రమదేవుడు.. గణపతి %-% సోమల దంపతుల ద్వితీయ సంతానం. చూపులకు ఏదో వింత శరీరుడిలా తోచాడు జాయచోడునికి. కాకతీయవంశానికి కాబోయే వారసుడు.. అతని ఆహార్యం వింతగా ఉంది. కంచుకంపై బంగారపు కవచం ధరించాడేమిటి? పరీక్షగా చూస్తే.. అది వక్షస్థలాన్ని నొక్కిపెడుతున్నట్లు! మరింత పరీక్షగా చూస్తే.. చూడకూడని యుక్తవయస్కురాలి యువ సమున్నతాలను దాచడానికి ప్రయత్నం చేస్తున్నట్లుగా తోచింది. సాధారణంగా యుద్ధవీరులైన మహిళలు అలాంటి కవచాలను ధరిస్తారు. కానీ యువ రారాజు, యుద్ధరంగంలో ఉన్నట్లు అక్క పెళ్లిసంబరాలలో దుస్తులపై కవచం ధరించడం ఏమిటి?! రుద్రమదేవుని జనన సమయంలో రాజ్యంలో చెలరేగిన వాద ప్రతివాదాలు గుర్తొచ్చాయి జాయచోడునికి. చతుష్పథం వద్ద మిత్రుల చర్చలు కళ్లముందు కదలాడాయి. ఇతనికోసమా అప్పట్లో రాజ్యమంతా అట్టుడికిపోయింది?! ఇతనా కాబోయే చక్రవర్తి? ఇతనా పరిణత రాజకీయవేత్త, రణరంగ నిపుణుడు, ఆయన కలలోకి వచ్చినా శత్రువు గుండె ఆగి మరణిస్తాడని కవులు కీర్తించే గణపతిదేవుని వారసుడు? అతణ్ని ఎగాదిగా చూసి జాయచోడుని ఆనందం ఆవిరైపోయింది. అప్పుడే రుద్రమదేవుడు కూడా జాయచోడుణ్ని పరిశీలనగా చూస్తున్నాడు. తననే చూస్తున్న రుద్రమదేవుణ్ని చూసి పలకరింపుగా నవ్వాడు జాయచోడుడు. అతను తిరస్కారంగా చూసి మూతి తిప్పుకొని వెళ్లిపోయాడు.

దిమ్మెరపోయాడు జాయచోడుడు. వీరయువకుడు అలా మూతి తిప్పడం!??

అభినయాలు ఎన్నిరకాలో, ప్రతి శరీరభాగ కదలికలు ఎలా ఉండాలో సప్రమాణంగా చెప్పగల మహానాట్యకారుడు జాయచోడుడు విభ్రాంతి చెందాడు. ఆ మూతి తిప్పడం?? ఎటువెళ్లినా.. ఏమి చేస్తున్నా.. ఆ మూతి తిప్పుడు దృశ్యమే మరీమరీ జాయచోడుని కళ్లముందు కదలాడుతోంది. అతనిపై దృష్టిపెట్టాడు జాయచోడుడు. అతడు ఎవ్వరితో కలవడంలేదు. పక్కన ఇద్దరు పరిచారికలు అన్నీ సమకూరుస్తూ అతని వెన్నంటి ఉన్నారు. 'వెన్నంటి ఉన్నారు' అనే కంటే.. ఎవ్వరినీ కలవకుండా కాపలా కాస్తున్నారు అనొచ్చు.వెలనాడు కార్యాలయంలోనే పనిచేస్తూ జాయచోడుడు అనుమకొండ వచ్చిన నాటినుంచి తిరిగి ఆయన ఆంతరంగిక వార్తాహరుడుగా వ్యవహరిస్తున్న వృద్ధుడైన అంకమరట్టని పిలిచి రుద్రమదేవుని కదలికలు పరిశీలించమన్నాడు. మరునాడు అంకమరట్ట చెప్పాడు చెవిలో.. "యువరాజుగారిలో అబ్బాయి కంటే అమ్మాయి లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని యువకులే నవ్వుకుంటున్నారు. పైగా యువరాజుగారు యువకుల చెయ్యి తగిలినా చిరాకు పడిపోతున్నారట మహారాజా! ఇక భుజంపై చెయ్యి వేస్తే యుద్ధమేనట!". చలువపందిళ్లు వేస్తున్నచోట ఉన్నాడు రుద్రమదేవుడు. యువకులంతా కబుర్లు చెప్పుకొంటూ పనిచేస్తుంటే.. అతను మాత్రం ఇద్దరు చెలికత్తెల మధ్య చెంపకు చెయ్యి ఆన్చి విస్ఫారిత నేత్రాలతో చూస్తున్నాడు. చెలికత్తెలు ఏదో చెప్తున్నారు. ముగ్ధ మనోహరంగా అచ్చమైన తెలుగింటి ఆడపిల్లలా నవ్వుతున్నాడు. నవ్వుతున్నప్పుడు ఆ బుగ్గలపై బుజ్జిబుజ్జి చొట్టలు చూడముచ్చటగా కనిపించీ కనిపించకుండా వచ్చి పోతున్నాయి. జాయచోడుని మనసంతా విచారం అలుముకుంది. రుద్రమదేవుడు కేవలం స్త్రీ అయితే ఎంత కన్నులపండువగా ఉంటుంది! తల్లిలా ఛాయ తక్కువైనా.. అందానికి తిరుగులేదు!!

భగవంతుడా.. బావగారికి ఎంత పెద్ద పరీక్ష పెట్టావయ్యా!!

ప్చ్.. బావగారితో వీడి గురించి చర్చించాలి అనుకుంటూ గణపాంబ ఉన్న మందిరంలోకి ప్రవేశించాడు. ఎదురుగా గణపాంబను అలంకరిస్తున్నారు సైరంధ్రిలు, పుష్పలావికలు. సహకరిస్తూ హాస్యమాడుతున్న మిత్రురాళ్లు, బంధువుల్లోని యువతులు. అదొక యువ యవ్వన కెరటాలు ఎగసిపడుతున్న సంద్రం. ఆ మందిరమంతా విరిసిన నవ్వుల నవ సుమపరిమళంతో పల్లవించి ప్రవహిస్తోంది. 'తను ఆ యవ్వనప్రాయపు సవ్వడులను దాటిపోయాడేమో..' పలకరింపుగా నవ్వి వెనుదిరిగాడు. "మామా.." పిలిచింది గణపాంబ. ఆగి వెనుదిరిగి చూశాడు. గణపాంబ ఆత్మీయంగా పరిగెత్తుకు వచ్చింది. "వీడు.. నా తమ్ముడు. రుద్రమదేవుడు!". "ఆరోజు తండ్రిగారు పరిచయం చేశారుగా పెద్దతల్లి. కానీ, మాట్లాడలేదు" అన్నాడు రుద్రమదేవుణ్ని ఎగాదిగా చూస్తూ. "రుద్రా.. జాయచోడదేవుడు మామ. వినే ఉంటావు. దైవం ప్రసాదించిన మామ. ఎవరికోగానీ, ఇలాంటి మామ దొరకడు. మహాయోధులు, మహానాట్యకారులు కూడా. అంతేకాదు తండ్రిగారికి అత్యంత నమ్మకస్తులు.." గొప్పగా చెప్పింది గణపాంబ. "విన్నాను. విన్నాను. పిఠాపుర యుద్ధంలో తండ్రిగారికి ఆయుధం అందించిన తీరు తండ్రిగారు ఎప్పుడూ చెబుతుంటారు. త్రిపురాంతకంలో మా యుద్ధగురువులు కూడా మామ ప్రతిభను పాఠాల వేళ ప్రస్తావిస్తుంటారు. ఇప్పుడు దగ్గరగా చూస్తున్నాను" అన్నాడు రుద్రమదేవుడు తిప్పుకొంటూ.అతని గొంతు.. హతవిధీ! ఎంత అన్యాయం చేశాడు దేవుడు. గొంతుకూడా స్త్రీలాలిత్యంతో ఎంత శ్రావ్యంగా ఉంది! రాత్రి ఆంతరంగిక మందిరంలో గణపతిదేవుడితో అన్నాడు జాయచోడుడు. "రుద్రమదేవుడి అంశంలో.. దేవుడు అన్యాయం చేశాడు బావగారు!". పెళ్లి ఏర్పాట్లలో చాలా అలసిపోయినట్లు ముఖం పెట్టాడు గణపతిదేవుడు. "వాడు.. అక్కడే ఇంకా బాగాచదివి ప్రవర్ధిష్ణువు కావాలి. కానీ, అక్కపెళ్లి చూడాల్సిందేనని పట్టుబట్టి మరీ వచ్చాడు. ప్చ్! నిద్ర వస్తోంది జాయా.." అన్నాడు ఆవులిస్తూ. ఆయన ముక్తసరిగా సంభాషణ ముగించి.. 'వెళ్లిపో!' అన్నట్లు మాట్లాడటం ఆశ్చర్యపరచింది. మరునాడు రాజనగరిలో వివాహానికొచ్చిన అతిథులకు నాట్య ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. మొదటి ప్రదర్శనే జాయచోడుని నృత్తం. తొలి ప్రదర్శన కావడం.. అదీ జాయచోడుడు నర్తించనుండటంతో రాజనగరి నాట్యమండపం కిక్కిరిసిపోయింది.అందరూ ఆయన నృత్త విన్యాసాన్ని శారీరక కదలికలను విభ్రాంతితో చూస్తున్నారు. సాక్షాత్తూ నటరాజు కైలాసం వీడి అనుమకొండ వచ్చినట్లు.. ఆడుతున్నాడు జాయచోడుడు. కానీ, అతనిలో ఏకాగ్రత లేదు. భావప్రకటన విరుద్ధంగా ఉంది. పాద ముద్రలు తడబడుతున్నాయి. హస్తముద్రలైతే ఘోరం. కానీ, ప్రేక్షకులు ఎప్పటిలాగే విస్మయంతో చప్పట్లు కొట్టి ఆయనను అభినందనలతో ముంచెత్తారు. తీవ్ర విషాదంలో కూరుకుపోయాడు జాయచోడుడు. మొదటిసారి తను నృత్తంలో తప్పటడుగులు వేశాడు. నటుని తాదాత్మ్యత కోల్పోయాడు. విన్యాస విచిత్రాలకు మాత్రమే సాధారణ ప్రేక్షకులు మైమరుస్తారు. కానీ నాట్య ప్రవీణులు చూస్తే ముఖాన ఊస్తారు. పూర్తిగా ఘోరమైన మార్గినృత్తం. దీనికంటే ఓ మారుమూల పల్లెటూరిలో దేశీ ప్రదర్శన ఉత్తమం. తల వంచుకుని రంగమండపం దిగిపోతున్న జాయచోడుడు.. ప్రేక్షకుల్లో ఓ యువతి తనను పరికించి చూడటం గుర్తించాడు. ఎవరీమె? ఎక్కడో చూచినట్లు తెలుస్తోంది. ఎవరీమె.. ఎవరై ఉంటారు?.. ఆమె చేతులు జోడించి అభినందనగా చప్పట్లు చరచి తిరిగి చేతులు జోడించి నమస్కరించి అభినందనగా చూసి మాయమైంది.ఆ పిల్లను చూశాక అతని నృత్త విఫలత తాత్కాలికంగా పక్కకుపోయింది. ఎవరీ పిల్ల?! ఎక్కడ చూశాను అనే ఆలోచన పెరిగిపోయింది. వివాహం క్రతువు పదిరోజులు. ముందువెనకా సంబరాలు మొత్తంగా నెలరోజులు. ఇటు వియ్యాలవారి ఆచార వ్యవహారాలను సమాదరిస్తూ, అటు గణపతిదేవునికి, సోమలదేవికి సహకరిస్తూ శాస్త్రీయ వివాహతంతులలోనూ జాయచోడుడే. యువకులతో చెడుగుడు, యువతులతో పాత్ర గొంఢ్లి, గుర్రం భంజలి.. అందరినీ కలిపి బిళ్లంగోడు.. అలాగే యువతీ యువకులకు లాస్యనాట్యం, దండరాసకం నేర్పించి, ఆడించి, ఆడి, నాట్యం చేసి నవ్వించి కవ్వించి పెళ్లి వేడుకలను మరపురాని మధుర సంఘటనగా లిఖించాడు. అప్పగింతల వేళ రాజ ప్రాసాదమంతా ఉద్వేగపు కన్నీటిలో తడిసి ముద్దయ్యింది. సహజంగా స్త్రీలందరూ తీవ్రంగా దుఃఖిస్తున్నారు కానీ కాస్త ఎక్కువగా ఏడ్చింది మాత్రం నారాంబతోపాటు రుద్రమదేవుడు! వెక్కివెక్కి ఏడ్చిన ఏకైక మగాడు!! కానీ, మరి కొన్నిరోజులలో ఓ వార్త రాజధానిలో పుట్టి పెద్దలను భయవిహ్వలులను చేసింది. గణపతిదేవుని పెద్ద కుమారుడు.. యువరాజు రుద్రమదేవుడు ఆడమగ కానీ నపుంసకుడు!!

ప్రొటీన్ ఎక్కువగా తీసుకుంటున్నారా.. ఈ సైడ్ ఎఫెక్ట్స్ తప్పవు

మనిషి ఆరోగ్యానికి ప్రొటీన్ ఎంతో మేలు చేస్తుంది. కానీ, మోతాదు మించితే రక్తంలో కలిసే ప్రొటీన్ విషంగా మారుతుంది. అందుకే మనిషి బరువును బట్టి అవసరమైన ప్రొటీన్ ను లెక్కగట్టి తీసుకోవాలంటున్నారు నిపుణులు. కిలో శరీరబరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ మాత్రమే అవసరం. కాబట్టి మీ బరువును బట్టి మీకెంత ప్రొటీన్ అవసరమో లెక్క వేసుకోవచ్చు. బరువు తగ్గేందుకు, కండరాల నిర్మాణానికి, కణాల రిపేర్ చేయడానికి ప్రొటీన్ చాలా అవసరం. అయితే ప్రొటీన్ అధికంగా ఆహారాన్ని అపరిమితంగా తింటే మాత్రం ఆరోగ్య సమస్యలు వస్తాయి.

దాహం పెరుగుతుంది

శరీరంలో ప్రొటీన్ ఎక్కువైతే శరీరం నీరసించి పోతుంది. తీవ్రమైన దాహం కలుగుతుంది. ఎందుకంటే.. అధిక ప్రొటీన్ వల్ల శరీరానికి ఎక్కువ నీరు కావాల్సి వస్తుంది. దాని వల్ల విపరీతమైన దాహం వేస్తుంది. దీనికి కారణం ప్రొటీన్లో ఉండే నత్రజని. ఇది అధికంగా రక్తంలో చేరడం వల్ల ఇలాంటి మార్పులు కలుగుతాయి. దీని వల్ల మూత్రపిండాలపై అధిక భారం పడుతుంది. వ్యర్థాలను బయటకు పంపేందుకు అధికంగా కష్టపడాల్సి వస్తుంది. ఎంత నీరు తాగిన శరీరానికి సరిపోదు. దీనివల్ల శరీరం బలహీనంగా మారిపోతుంది. తలనొప్పి ఎక్కువైపోతుంది. బరువు తగ్గి సన్నగా మారిపోతారు.

నోటి దుర్వాసన దీని లక్షణమే..

చాలా మంది నోటి దుర్వాసనతో బాధపడుతుంటారు. ఇందుకు ఆహారంలో అధిక ప్రొటీన్ కూడా కారణమేనంటున్నారు. ప్రొటీన్లో ఉండే రెండు ఆమ్లాల తీవ్రమైన దుర్గంధాన్ని కలిగిస్తాయి. ఇందుకోసం కూడా అధికంగా నీళ్లు తాగాల్సి వస్తుంది.



మలబద్ధకం

ప్రొటీన్ శరీరంలో అధికమైతే మలబద్ధకం సమస్య కూడా ఎక్కువవుతుంది. కార్బోహైడ్రేట్లు తగ్గి, ప్రొటీన్ పెరిగితే మాత్రం ఈ సమస్య మరీ తీవ్రంగా మారుతుంది. ప్రొటీన్ ఉండే ఆహారం అధికంగా తిన్నామనిపిస్తే, కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారాన్ని అధికంగా తినాలి.

ప్రొటీన్ అధికంగా ఉండే పదార్థాలు...

కొన్ని ఆహారాల్లో ప్రొటీన్ అధికంగా దొరుకుతుంది. మటన్, చికెన్, గుడ్లు , చేపలు, రొయ్యలు, పాలు, పెరుగు, చీజ్, నట్స్ (బాదం, జీడిపప్పు,వాల్నట్స్, గుమ్మడి గింజలు, నువ్వులు, సన్ ఫ్లవర్ గింజలు, టోఫు, అన్ని రకాల బీన్స్, శెనగలు... వీటన్నింటిలో ప్రొటీన్ ఉంటుంది.

ఒంటి నొప్పులు..

ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీరంలో వేడిని కలిగిస్తాయి. ఉదాహరణకు చికెన్, గుడ్లు, రొయ్యలు వంటివి. వీటిని మోతాదుకు మించి తీస్కుంటే ఒంటి నొప్పులు వేధిస్తాయి.

ప్రేమంటే ఏమిటంటే



'జనవరి జయం జయం.. ఫిబ్రవరి పెండ్లికి పిలుపు' అని చిన్నప్పటి గేయం. వాలంటైన్ పుణ్యమా అని ఫిబ్రవరి అంతా ప్రేమికుల మాసంగా మారిపోయింది. ఈ నెల కోసం యువత ఏడాదంతా ఎదురు చూస్తూ ఉంటుంది. ప్రేమను వ్యక్తం చేయడానికి, ప్రేమించిన వారితో సమయం గడపడానికి వాలెంటైన్ డేని చాలామంది ఓ ప్రత్యేకమైన సందర్భంగా భావిస్తారు. గిఫ్టులు, టూర్లు ప్లాన్ చేస్తారు. ఫిబ్రవరి 14వ తేదీ ఒక్కరోజులో ప్రపంచవ్యాప్తంగా కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుందంటే అతిశయోక్తి కాదు. గులాబీలు, చాక్లెట్లు, ఖరీదైన బహుమతుల కొనుగోళ్లతో అన్ని షాపులు బిజీ బిజీ. మనిషిని ఇంతలా వశపరచుకుంటున్న ఈ ప్రేమ ఎక్కడ మొదలవుతుంది? ఎన్ని రకాలుగా ఉంటుందో.. తెలుసుకుందాం.పరీక్షలఅప్పుడెప్పుడో గజినీ సినిమాలో సూర్య, అసిన్ 'హృదయం ఎక్కడున్నది.. హృదయం ఎక్కడున్నది..' అంటూ ప్రేమ గీతం పాడుకుంటే అందరూ ఫిదా అయ్యారు. ప్రేమ మనిషిలో ఎక్కడ ఉంటుందో తెలుసుకోవడానికి ఒక్కరూ ప్రయత్నించలేదు. సైకాలజిస్టులు మాత్రం ఈ అంశంపైన దృష్టి సారించారు. న్యూయార్క్‌లోని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ మెడికల్ కాలేజ్‌కి చెందిన బినాక అస్విడో రొమాంటిక్ లవ్‌పై పరిశోధనలో భాగంగా ప్రేమ మెదడులో ఎక్కడ ఉంటుందో తెలుసుకోవడానికి ప్రయత్నించారు. ప్రేమలో ఉన్నవారికి ప్రేయసి లేదా ప్రియురాలు ఫొటో చూపించినప్పుడు మెదడులోని వెంట్రల్ టెగ్మెంటల్ ఏరియా (వీటీఏ), న్యూక్లియస్ అకమ్బన్స్, వెంట్రల్ పల్లిడియం, రఫే న్యూక్లియస్ ప్రాంతాలు ఉత్తేజితమయ్యాయని ఎఫ్.మ్యాగ్నెటిక్ రెజోనెన్స్ ఇమేజింగ్ ద్వారా తెలుసుకున్నారు.

తొలి రోజుల్లో..

వెంట్రల్ టెగ్మెంటల్ ఏరియా రివార్డ్ సిస్టంలో కీలకమైన ప్రాంతం. నూతన ప్రేమికుల్లో ఈ ప్రాంతం బాగా ఉత్తేజితమవుతుందని పరిశోధనలో తేలింది. వెంట్రల్ పల్లీడియం, రఫే న్యూక్లియస్ ప్రాంతాలు 20 ఏళ్ల తర్వాత కూడా ఒకరి పట్ల ఒకరికి ప్రేమ ఉండటానికి కారణమని తెలుస్తుంది. వెంట్రల్ పల్లీడియం అటాచ్‌మెంట్ హార్మోన్లను విడుదల చేసి బంధం నిలబడేలా చేస్తుంది. దీర్ఘకాలిక ప్రేమికుల్లో రఫే న్యూక్లియస్ సెరటోనిన్ హార్మోన్ రిలీజ్ చేసి బంధంలో కుదురుకునేటట్టుగా చేస్తుంది. మనుషుల్లో ప్రేమ భావన పెంపొందడంలో మెదడులోని రివార్డ్ సిస్టం కీలక పాత్ర పోషిస్తుందని న్యూరోసైన్స్ చెబుతుంది. మెదడులోని హిప్పో క్యాంపస్, మీడియల్ ఇన్సుల, యాంటీరియర్ సింగ్లేట్ భాగాలు రివార్డ్ సిస్టంలో ప్రధాన పాత్ర పోషించి ప్రేమ అనే భావన వృద్ధి చెందేలా చేస్తాయని పరిశోధనలో తేలింది.

కెమికల్ గడబిడ ..

ప్రేమ అనే ఫీలింగ్ కలిగినప్పుడు మెదడులో ఏం జరుగుతుందనే దానిపై హార్వర్డ్ మెడికల్ కళాశాల శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. మెదడులో విడుదలయ్యే కొన్ని రసాయనాల ఫలితమే ప్రేమ అని తేల్చి చెప్పారు. ప్రియురాలితో చూపు కలవగానే మెదడులో ఫినెల్ తలామిన్ అనే రసాయనం విడుదలవుతుంది. అరచేతుల్లో చెమట పట్టడం.. మోకాళ్లు వణకడం ఈ హార్మోన్ ప్రభావమే. ఈ లవ్ మాలిక్యూల్ కొద్ది మోతాదులో చాక్లెట్‌లా ఉంటుంది. అందుకనే వాలంటైన్ రోజు చాక్లెట్ల అమ్మకాలు ఊపందుకుంటాయి. ఒక మనిషిపై వ్యామోహం కలగడానికి మెదడు విడుదల చేసే అడ్రినలిన్, డోపమైన్, నారెఫీనెప్రిన్ హార్మోన్లే కారణం. నచ్చినవారి చూడగానే శరీరంలో ఈ హార్మోన్లు విడుదలై అనేక స్పందనలు కలిగిస్తాయి. అందుకే ప్రేమికులు గంటల కొద్దీ కబుర్లు చెప్పుకొంటారు. ప్రపంచాన్ని మర్చిపోతారు. ఈ దశలో వీరిలో ఆక్సిటోసిన్ అనే హార్మోన్ రిలీజ్ అవుతుంది. దీని ప్రభావంతో ఒకరిని ఒకరు టచ్ చేయాలని, హగ్ చేసుకోవాలని అనిపిస్తుంది. ఈ హార్మోన్ల ప్రభావం 3 నెలల నుంచి 18 నెలల వరకూ ఉంటుంది. ఆ తర్వాత కూడా ప్రేమ ప్రయాణం దీర్ఘ కాలం కొనసాగితే వాసోప్రెసిన్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. ఇది ఇద్దరి మధ్య బంధం మరింత బలపడటానికి దోహదపడుతుంది.


ఏడు రంగుల వాన

నేటి యువత ప్రేమ అని అనుకుంటున్నది ప్రేమ కాదు. కేవలం వ్యామోహం మాత్రమే. నిజమైన ప్రేమ అంటే ఏమిటో సైకాలజిస్ట్ స్టర్న్ బెర్గ్ తన త్రిముఖ ప్రేమ సిద్ధాంతంలో వివరించారు. ఇంద్రధనుస్సులో ఏడు రంగులు ఉన్నట్టే ప్రేమకు మౌలికాంశాలు అయిన సాన్నిహిత్యం, వ్యామోహం, నిబద్ధతల కలయికలతో ఏడు రకాల ప్రేమలు పుడతాయని ఆయన వివరించారు. లైకింగ్, ఇన్ ఫ్యాట్, లవ్, ఎంప్టీ లవ్, రొమాంటిక్ లవ్, కంపానియట్ లవ్, ఫటస్ లవ్, కంజుమేటివ్ లవ్ అని ఏడు రకాల ప్రేమలు ఉంటాయని వివరించారు. వీటన్నిటిలోనూ కంజుమెట్ లవ్ అనేది అతి ముఖ్యమైనది. నేటి యువత రొమాంటిక్ లవ్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది. అది పరిపూర్ణమైన ప్రేమ కాదు. సాన్నిహిత్యం, వ్యామోహం, నిబద్ధత కలగలిసిన ప్రేమే నిజమైనది, శాశ్వతమైనది. దాన్ని సాధించడం ఎంత కష్టమో, నిలుపుకోవడం కూడా అంతే కష్టం. ప్రేమ స్వరూపాన్ని, పరిపూర్ణత్వాన్ని అర్థం చేసుకున్న వారికి అది ఒక ఎమోషన్‌లా కాకుండా, మోటివేషన్‌లా పనిచేస్తుంది. ప్రేమ సఫలమైనా, విఫలమైనా జీవితంలో ముందుకు తీసుకువెళ్తుంది.

అమ్మగార్లు.. అయ్యగార్లు

రమాయణం

మొదట్లో మా ఇంట్లో వంటకు అయ్యగారు ఉండేవారు. అయితే, మేము మిడిల్ స్కూల్‌కు వచ్చేసరికి అమ్మే వంట చేసేది. ఏరోజూ ఏడెనిమిది మందికి తక్కువ కాకుండా తను వండాల్సి ఉండేది. అయినా.. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో వంటల కోసం అయ్యగార్లు, అమ్మగార్లూ వచ్చేవారు. 'ఆడ ఇక మా నాన్న తన అమ్మమ్మకూ, తాతయ్యకూ దత్తపుత్రుడు కనుక వాళ్లిద్దరికీ తద్దినాలు పెట్టేవాడు. అది చాలా ఖర్చు, శ్రమతో కూడిందైనా, నాన్న తన ఎనభై మూడో ఏట చనిపోయేదాకా.. సుమారు తన పద్నాలుగో ఏట నుంచీ.. అంటే దబ్బు ఏళ్లపాటు ఎంతో శ్రద్ధగా ఆబ్దికాలు పెట్టేవాడు. "ఎందుకు నానా ఈ తద్దినం పెట్టడం?!" అని ఓసారి అడిగాను. దానికి నాన్న ఎంతో ఓపిగ్గా.. "మనం రోజూ అన్నం తింటం గద! మరి పై లోకానికి పోయినోళ్లకు ఎవరు పెడతరు?! మనకు ఒక సంవత్సరం అయితె వాండ్లకు ఒకరోజు అన్నట్టు. అందుకోసం వాండ్లకు ఏడాదికొక్కసారి పిండాలు పెట్టాలె. దాన్ని కాకులకో, పక్షులకో పెడుతం. వాండ్లు పక్షుల రూపంల ఒచ్చి తినిపోతరని, అట్ల వాండ్ల దీవెనలు ఉంటయని పెద్దవాండ్ల నమ్మకం!" అని చెప్పాడు. అట్లాగే ఇంకోమాట కూడా చెప్పాడు.. "పెద్దవాండ్ల విశ్వాసం కోసం అది చెయ్యాలె. ఆ పేరుతోటి ఆరోజు ఒక పదిమంది ఆకలితోటి ఉన్నవాండ్లకు భోజనం పెడితే బాగుంటదని నాకనిపిస్తది".. ఆ మాట నాకు ఇప్పటికీ గుర్తుంది. వారం ముందే ఓ జీతగాడిని వెంటపెట్టుకుని వెళ్లి కిరాణా సామాను తెచ్చేవాడు నాన్న. అప్పుడే కాదు.. నాన్న ఎప్పుడు ఇంట్లోకి సామాను తెచ్చినా నాకూ, అక్కకూ చెరో బిస్కట్ ప్యాకెట్ తెచ్చి ఇచ్చేవాడు. మేము వాటికోసమే ఎంతో ఆత్రంగా ఎదురు చూసేవాళ్లం. అదే మాకు చాలా గొప్ప ఔట్ సైడ్ ఫుడ్. అదికూడా తరచుగా ఉండేది కాదు. ఏదైనా ఇంట్లో చేసింది తినడమే! తద్దినం రోజు ఏడింటికల్లా మా పక్కఊరు చాగల్లు నుంచి సింహయ్యగారు, ఆయన కొడుకు కేశవయ్యగారు వచ్చేవారు. ఆరోజు వీలైనంత వరకూ నేను బడి ఎగ్గొట్టడం తప్పనిసరి అని వేరే చెప్పక్కర్లేదుగా! వాళ్లు వస్తూనే మడిపంచెలు కట్టుకుని వంటింట్లో దూరేవారు. అమ్మకు ఒక్క వంట తప్పేది కానీ, మిగతా అన్ని పనులూ పెరిగేవి. ఓ పది రకాల వంటకాల కోసం బోలెడు కూరగాయలు కోసి, మిగతా వంట సామానంతా సిద్ధం చేసి ఉంచేది. వాళ్లు పిలిస్తే చాలు.. "ఏం గావాలె అయ్యగారూ!" అంటూ సిద్ధంగా ఉండేది. దగ్గరి మూడు కుటుంబాల బంధువులు భోజనాలకు వచ్చేవారు. ఇంకా పదిమంది దాకా పనివాళ్లకు, ఆరోజున ఎందరొస్తే అందరు బిచ్చగాళ్లకు భోజనాలు పెట్టడం అమ్మవంతే అయ్యేది. మేము కాస్త పెద్దయిం తరువాత వడ్డనలు చేసేవాళ్లం. అప్పుడు గ్రైండర్లు, మిక్సర్లు లేవు గనుక.. అయ్యగార్లు పెద్దరోటి ముందు కూచుని పప్పు రుబ్బేవారు. వాళ్లు చేసే గారెలు భలే రుచిగా ఉండేవి. మమ్మల్ని వంట చేసేటప్పుడు ఆ దరిదాపులక్కూడా రానిచ్చేవారు కాదు. మాకేమో మగవాళ్లు ఎలా వండుతారో చూద్దామని కుతూహలం. "ఇటు దిక్కు రావొద్దు.. మడి!" అనేవారు. ఇంకొక బ్యాచ్ బ్రాహ్మలు వచ్చి ఏవో మంత్రాలు చదివి నాన్నచేత తద్దినం పెట్టించేవారు. తరువాత అందరం వరుసగా కింద చిన్న చాపల మీద కూచొని.. ముందు విస్తర్లు పరుచుకుని ఉంటే, వాళ్లే వడ్డన చేసేవారు. సింహయ్య గారు అప్పటికే చాలా పెద్దాయన. ఆయనకు వంగడం వచ్చేది కాదు. అన్నిటినీ నిలబడే అంతెత్తునుంచి తపుక్కున విస్తట్లో వేసేవాడు. అయినా మేము భయంతో ఏమీ అనేవాళ్లం కాదు. ఆ తరువాత చాలా ఏళ్లపాటు కేశవయ్యగారు కూడా వచ్చేవాడు. నాన్న చనిపోయాక ఇక మా పుట్టింట్లో తద్దినాలు పెట్టడం ఆగిపోయింది. కొన్నాళ్లకు కేశవయ్యగారు మంచాన పడ్డాడని తెలిసి వెళ్లి చూసొచ్చాను. ఆయన పోయినా ఇప్పటికీ ఆ కుటుంబంతో



టచ్‌లోనే ఉన్నాం. మా చిన్నప్పుడు కూనూరు నుంచి లక్ష్మయ్యగారు, వాళ్లన్నయ్య మత్స్యయ్యగారు మా ఇంటికి వచ్చి పోతుండేవారు. "గీ మత్స్యయ్య ఏం పేరు? గీయిన మనిషే గద.. చేప పేరు పెట్టుకున్నడేంది?!" అని అమ్మను అడిగాను. "నీకు కోతి మాటలు బాగ ఎక్కువయినయ్! శ్రీ మహావిష్ణువు దశావతారాలల్ల మొదటిది ఏంది?!" అన్నది అమ్మ. నాకు ఠక్కున గుర్తొచ్చింది. "తిరుపతి, యాదగిరి, సింహాచలం.. అని దేవుని గుళ్లుండే ఊరి పేర్లు పెట్టుకున్నట్టే.. మత్స్యగిరి, వరాహగిరి, కూర్మనాథం అని కూడా పెట్టుకుంటరు" అన్నది అమ్మ. అప్పుడర్థమైంది. ఇంతకూ ఈ మత్స్యయ్యగారి గురించి చెప్పొచ్చేదేంటంటే.. ఈయన ఎప్పుడూ మా అక్కాచెల్లెళ్లిద్దరి మధ్యలో ఏదోఒక గొడవో, పోటీనో పెట్టి తమాషా చూద్దామనుకునేవాడు. మేమేం తక్కువా?! ఆదర్శ అక్కాచెల్లెళ్లం మరి! మాకు పెద్దగా కొట్లాటలే వచ్చేవి కావు. ఆయన మా పుట్టినరోజులు గుర్తు పెట్టుకుని ఒకరోజు ముందుగానే వచ్చేవాడు. పుట్టినరోజంటే పెద్దగా కేక్ కట్‌చేయడం, స్నేహితుల్ని పిలవడం, సెలెబ్రేట్ చేయడం లాంటివి మాకు తెలియదు. ఆరోజు తలంటు పోసుకోవడం, ఉన్నంతలో కొత్త బట్టలు వేసుకోవడం చేసేవాళ్లం. అమ్మ ఏదైనా స్వీట్ చేసేది. ఈ మత్స్యయ్యగారు రాగానే.. "పోయినేడు మీ చెల్లె పుట్టినరోజుకు లడ్డూలు చేయించింది అమ్మ. మరి నీ పుట్టిన్రోజుకు ఏం చెయ్యాలె చెప్పు?! మీ అమ్మను అడుగు" అంటూ అక్కను రెచ్చగొట్టేవాడు. ఇక అక్క లడ్డూలు చేయించమని అమ్మ వెంటపడేది. ఆ తరువాత వచ్చే నా పుట్టినరోజు కూడా అంతే! "మీ అక్క పుట్టినరోజుకు లడ్డూలు చేసిన్రు. నీకు గూడ గవ్వే అయితె ఏం బావుంటది?! మంచిగ మైసూర్ పాక్ చేయించుకో.. అమ్మ తోటి చెప్పుపో!" అనేవాడు. "ఏం జెయ్యాల్నో అమ్మకు తెల్సు" అనేదాన్ని నేను. ఈయన కథ ఇలా ఉంటే.. అప్పుడప్పుడూ మా ఇంటికి కూనూరు నుంచి అండమ్మగారూ, లక్ష్మయ్యగారూ వచ్చేవారు. వాళ్ల ముచ్చట్ల గురించి వచ్చేవారం చెప్పుకొందాం!